



ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 150 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-

సోమవారం 06 జనవరి 2025

RNI No: APTEL/2023/87888

Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


## కాంగ్రెస్, భాజపాలకూ 'గ్రీన్ కో ' ఎన్నికల బాండ్లు: కేటీఆర్

గ్రీన్ కో ఎన్నికల బాండ్ల అంశంపై మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు.



**హైదరాబాద్, జనవరి 06, (రిపబ్లిక్ న్యూస్):** గ్రీన్ కో ఎన్నికల బాండ్ల అంశంపై మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. గ్రీన్ కో సంస్థ 2022లో ఎన్నికల బాండ్లు ఇచ్చిందని చెప్పారు. 2023లో ఫార్ములా ఈ-రేసు జరిగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్, భాజపాకు కూడా గ్రీన్ బాండ్లు ఇచ్చిందన్నారు. ఫార్ములా ఈ-రేసు కారణంగా గ్రీన్కో నష్టపోయిందని వివరించారు. పార్లమెంట్ ఆమోదించిన ఎన్నికల బాండ్లు అవినీతి ఎలా అవుతుందని ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా అన్ని పార్టీలకు వచ్చిన బాండ్లపై చర్చకు సిద్ధమని కేటీఆర్ తెలిపారు.అంతకుముందు ఫార్ములా ఈ-రేసు కేసుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక విషయాన్ని బయటపెట్టింది. రేసు నిర్వహించిన గ్రీన్కో సంస్థ ద్వారా భారాసకు రూ.కోట్ల లబ్ధి చేకూరినట్లు వెల్లడించింది. ఆ పార్టీకి ఎన్నికల బాండ్ల ద్వారా రూ.41 కోట్లు చెల్లించినట్లు చెప్పింది. గ్రీన్కో, అనుబంధ సంస్థలు 2022 ఏప్రిల్ 8- అక్టోబర్ 10 మధ్య 26 సార్లు బాండ్లు కొన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## 'స్వర్ణ కుప్పం'.. విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

వైకాపా హయాంలో రాష్ట్రం వెనుకబడిందని.. అప్పుల కుప్పగా మారిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.





**కుప్పం,జనవరి 06, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా హయాంలో రాష్ట్రం వెనుకబడిందని.. అప్పుల కుప్పగా మారిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. కష్టపడితేనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు.హైదరాబాద్ లో నాడు తాను చేసిన అభివృద్ధి ఫలాలే ఇప్పుడు వస్తున్నాయని చెప్పారు. 2014-19 మధ్య ఏపీని అభివృద్ధి పథంలో నడిపించామని చెప్పారు. ద్రావిడ యూనివర్సిటీలో 'స్వర్ణ కుప్పం- విజన్ 2029' డాక్యుమెంట్ ఆవిష్కరణ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. ప్రతి ఇంటికీ పారిశ్రామికవేత్త ఉండాలనేది తన విజన్ అని చెప్పారు."రాబోయే రోజుల్లో కుప్పంను ఎలా అభివృద్ధి చేస్తామో ప్రణాళికలు రచించాం. ఏటా ఎలాంటి పనులు చేపట్టాలనేదానిపై ఆలోచన చేశాం. కుప్పానికి పెట్టుబడుదులు తీసుకొచ్చి ఉపాధి కల్పిస్తాం. జీవితం ఎవరికీ జాక్పాట్ కాదు. ఒకసారి అవకాశం వస్తుంది.. దాన్ని సద్వినియోగం చేసుకోకపోతే వైకుంఠపాళి తరహా పరిస్థితే ఎదురవుతుంది. రాజకీయం, వ్యాపారం సహా అన్ని రంగాలకూ ఇది వర్తిస్తుంది.ఈసారి నియోజకవర్గాల వారీగా విజన్ తయారు చేస్తున్నాం. ప్రజలకు అందుబాటులో ఉండివారి ఆకాంక్షలను ఎప్పటికప్పుడు నెరవేర్చగలిగితే.. అలాంటి నేతలు శాశ్వతంగా ఎమ్మెల్యేలుగా ఉంటారు. తెదేపా ఆవిర్భావం తర్వాత కుప్పంలో తెదేపా తప్ప వేరే పార్టీ జెండా ఎగరలేదు. పోటీ చేసిన అన్ని సార్లూ ప్రజలు గెలిపించారు. కుప్పం ప్రజలు చూపిస్తున్న అభిమానానికి ధన్యవాదాలు. విజన్ డాక్యుమెంట్ విషయంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ప్రతి ఇంటిలోనూ దీనిపై చర్చ జరగాలి. ఉద్యోగాలు చేయడమే కాకుండా ఇవ్వాలనే ఆలోచన యువతలో ఉండాలి" అని చంద్రబాబు అన్నారు.

## గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి కేసు .. 17 మంది ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేత

గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి కేసులో నిందితుల ముందస్తు బెయిల్ పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది.

**అమరావతి, జనవరి 06, (రిపబ్లిక్ న్యూస్):** గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి కేసులో నిందితుల ముందస్తు బెయిల్ పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. తెదేపా కార్యాలయంపై దాడి కేసులో 17 మంది ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. వీరి పిటిషన్లను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. కేసులో ఇప్పటివరకు మొత్తం 89 మందిని నిందితులుగా చేర్చారు. ఇదే కేసులో ఏ71గా వల్లభనేని వంశీమోహన్ ఉన్నారు.వైకాపా హయాంలో గన్నవరం తెదేపా కార్యాలయంపై వల్లభనేని వంశీ అనుచరులు దాడికి పాల్పడ్డారు. తెదేపా కార్యాలయ ఆవరణలోని కారుకు నిప్పంటించారు.కార్యాలయంలోని సామగ్రిని ధ్వంసం చేశారు.




## కాకినాడ సెజ్ కేసు.. ఈడీ విచారణకు హాజరైన వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి

వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు.



**హైదరాబాద్, జనవరి 06, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. బషీర్బాగ్లోని ఈడీ కార్యాలయానికి ఆయన వచ్చారు. కాకినాడ పోర్టు సెజ్కు సంబంధించిన కేసులో ఈడీ ఎదుట విచారణకు ఆయన వచ్చారు.వైకాపా హయాంలో కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ (కేఎస్పీఎల్), కాకినాడ సెజ్ (కేసెజ్)ల్లోని యా.3,600 కోట్ల విలువైన షేర్లను కర్నాటి వెంకటేశ్వరరావు (కేవీ రావు) నుంచి బలవంతంగా లాగేసుకున్న కేసులో ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. దీని ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలో ఎంపీ విజయసాయిరెడ్డికి గతంలోనే నోటీసులు ఇచ్చి విచారణకు రావాలని సూచించింది. పార్లమెంట్ సమావేశాల కారణంగా ఆయన కహాజరుకాలేదు. దీంతో మళ్లీ నోటీసులు ఇవ్వడంతో విజయసాయిరెడ్డి నేడు విచారణకు హాజరయ్యారు.

## ప్రయాణికుల్లో గందరగోళం

..రాజమహేంద్రవరంలో నిలిచిన సాయినగర్ షిర్డీ ఎక్స్ ప్రెస్


రైలు షెడ్యూల్ లో మార్పు కారణంగా ప్రయాణికుల్లో గందరగోళం నెలకొంది.



**రాజమహేంద్రవరం, జనవరి 06, (రిపబ్లిక్ న్యూస్):** రైలు షెడ్యూల్లో మార్పు కారణంగా ప్రయాణికుల్లో గందరగోళం నెలకొంది. దీంతో రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్లో సాయినగర్ షిర్డీ ఎక్స్ప్రెస్ ను నిలిపివేశారు. సుమారు 3 గంటలుగా రైలు అక్కడే నిలిచిపోయింది.జనవరి 1 నుంచి కాకినాడ పోర్టు- సాయినగర్ షిర్డీ ఎక్స్ప్రెస్ షెడ్యూల్లో మార్పు జరిగింది. మార్చిన సమయం ప్రకారం సోమవారం ఉదయం 5 గంటలకే కాకినాడ నుంచి రైలు బయల్దేరింది. గతంలో ఇదే రైలు ఉదయం 6 గంటలకు ఉండేది. జనవరి 1 నుంచి సమయంలో మార్పు జరగడంతో కాకినాడ పోర్టు , సామర్లకోట స్టేషన్లలో పలువురు ప్రయాణికులు రైలు ఎక్కలేకపోయారు. సమయం మార్పుపై ముందుగానే సమాచారం ఇచ్చామని రైల్వే సిబ్బంది చెప్పారు.ప్రయాణికుల ఫిర్యాదుతో రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్లో సాయినగర్ షిర్డీ ఎక్స్ప్రెస్ను నిలిపివేశారు. కాకినాడ, సామర్లకోటలో ఉన్న ప్రయాణికులను శేషాద్రి ఎక్స్ప్రెస్లో రాజమహేంద్రవరానికి తరలిస్తున్నారు. వారు చేరుకున్నాక సాయినగర్ షిర్డీ ఎక్స్ప్రెస్ అక్కడి నుంచి ఉదయం 9.19 గంటలకు బయల్దేరింది.

## కూటమి ప్రభుత్వంతో రైతుల కుటుంబాల్లో సంక్రాంతి సందడి : మంత్రి నాదెండ్ల

ధాన్యం సేకరించిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.



**అమరావతి, జనవరి 06, (రిపబ్లిక్ న్యూస్):** ధాన్యం సేకరించిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆదివారం నాటికి 27 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించామని చెప్పారు. ధాన్యం సేకరణపై మంత్రి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు."4,15,066 మంది రైతుల నుంచి ఖరీఫ్ సీజన్లో ధాన్యం సేకరించాం. వైకాపా హయాంలో కేవలం 2 లక్షల మంది రైతుల నుంచే ధాన్యం కొన్నారు. ధాన్యం సేకరించిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నాం. రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.6,083.69 కోట్లు జమ చేశాం. వైకాపా హయాంలో ధాన్యం డబ్బులు కూడా సక్రమంగా ఇవ్వలేదు. రైతుల కుటుంబాల్లో కూటమి ప్రభుత్వం సంక్రాంతి సందడి తెచ్చింది" అని నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

## హనుమకొండలో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులప్రారంభం

హనుమకొండలో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ కొండా సురేఖ జెండా ఊపి బస్సు సర్వీసులను ప్రారంభించారు.



**హనుమకొండ, జనవరి 06, (రిపబ్లిక్ న్యూస్):** హనుమకొండలో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ , కొండా సురేఖ జెండా ఊపి సర్వీసులను ప్రారంభించారు. అనంతరం మంత్రులు, జాప్రతినిధులు బస్సులో కొంత దూరం ప్రయాణించారు. ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు మంత్రులు

## అల్లు అర్జున్ కు మరోసారి రాంగోపాల్పేట్ పోలీసుల నోటీసులు

సినీనటుడు అల్లు అర్జున్ కు రాంగోపాల్పేట్ పోలీసులు మరోసారి నోటీసులు జారీ చేశారు.



**హైదరాబాద్, జనవరి 06, (రిపబ్లిక్ న్యూస్):** సినీనటుడు అల్లు అర్జున్ కు రాంగోపాల్పేట్ పోలీసులు మరోసారి నోటీసులు జారీ చేశారు. కిమ్స్ ఆసుపత్రికి ఎప్పుడు రావాలనుకున్నా తమకు సమాచారం ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. ఈమేరకు గీతా ఆర్ట్స్ కార్యాలయానికి వెళ్లి అల్లు అర్జున్ మేనేజర్ కరుణాకరు నోటీసులు అందజేశారు.మరోవైపు ఆదివారం కూడా అల్లు అర్జున్కు రాంగోపాల్పేట్ పోలీసులు నోటీసులు ఇచ్చారు. కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్ను పరామర్శించేందుకు రావొద్దని అందులో పేర్కొన్నారు. ఆసుపత్రికి ఆయన వస్తున్నారన్న సమాచారంతో నోటీసులు ఇచ్చారు. బెయిల్ షరతులు తప్పనిసరిగా పాటించాలని అందులో సూచించారు. పరామర్శకు వస్తే తమ సూచనలు పాటించాలన్నారు. ఏదైనా జరిగితే అల్లు అర్జున్ బాధ్యత వహించాల్సి వస్తుందని తెలిపారు. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో గాయపడిన శ్రీతేజ్ అనే బాలుడు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# ఆ ట్రోల్స్ వల్ల డిప్రెషన్ లోకి వెళ్లా : మీనాక్షి చౌదరి

రిపబ్లిక్ సినిమా CINEMA

'సంక్రాంతికి వస్తున్నాం' ప్రచారంలో భాగంగా మీనాక్షి ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. తనపై గతంలో ట్రోల్స్ వచ్చినట్లు తెలిపారు.



తెలుగు, తమిళ సినిమాల్లో వరుస విజయాలు అందుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్నారు హీరోయిన్ మీనాక్షి చౌదరి అగ్ర కథానాయకుడువెంకటేశ్తో కలిసి 'సంక్రాంతికి వస్తున్నాం' అంటూ ఈ పెద్ద పండగకు థియేటర్లలో సందడిచేయనున్నారు. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మీనాక్షి మాట్లాడుతూ'ది గోట్' రిలీజ్ అయ్యాక తనపై ట్రోల్స్ వచ్చినట్లు వెల్లడించారు. "విజయ్ హీరోగా వచ్చిన 'దిగోట్' విడుదలైన తర్వాత నన్ను చాలా మంది ట్రోల్ చేశారు. అవి చూసి ఎంతో బాధపడ్డా. వారంరోజులు డిప్రెషన్లోకి వెళ్లా. తర్వాత 'లక్కీ భాస్కర్' విడుదలైంది. ఆ చిత్రం గొప్ప విజయాన్నిఅందుకుంది. అందులో నా నటనకు ఎన్నో ప్రశంసలు లభించాయి. కథల ఎంపికలో మార్పులుచేయాలని అప్పుడే నిర్ణయించుకున్నా. మంచి సినిమాలపై ష్టిపెట్టాలని అర్థం చేసుకున్నా" అనిచెప్పారు.గతేడాది ఆరు సినిమాలతో సందడి చేసిన మీనాక్షి ప్రస్తుతం 'సంక్రాంతికి వస్తున్నాం' ప్రచారంలో బిజీగా ఉన్నారు. వెంకటేశ్ అనిల్ రావిపూడి కాంబోలో తెరకెక్కిన ఈ చిత్రం జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఐశ్వర్యా రాజేశ్ మరో హీరోయిన్. ఇటీవల ఈ చిత్రం గురించి మీనాక్షి మాట్లాడుతూ.. కామెడీ జానర్ సినిమాలో నటించడం, యాక్షన్ సీక్వెన్స్లను చేయడం ఇదే తొలిసారని చెప్పారు. పోలీస్ రోల్ చేయాలనేది తన డ్రీమ్ అని కెరీర్ తొలినాళ్లలోనే ఆ అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 'సంక్రాంతికి వస్తున్నాం' వినోదాత్మకంగా సాగే కాప్ రోల్ నటించడం కొత్త అనుభూతినిచ్చిందన్నారు. నవీన్ పొలిశెట్టితో కలిసి 'అనగనగ ఒక రాజు' చేస్తున్నట్లు తెలిపారు. మరో రెండు ప్రాజెక్టు లైనప్లో ఉన్నాయని వాటి వివరాలు త్వరలోనే వెల్లడిస్తానన్నారు.

## 'ఈటీవీ విన్'లో సర్వైవల్ థ్రిల్లర్.. 'బ్రేక్ అవుట్' స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్

**సర్వైవల్ థ్రిల్లర్ మూవీ 'బ్రేక్ అవుట్ స్ట్రీమింగ్ డేట్ ఖరారైంది. 'ఈటీవీ విన్' లో ఇది రిలీజ్ కానుంది. ఎప్పుడంటే?**

ప్రేక్షకులకు వినోదం పంచేందుకు ఈ నెలలో నాలుగు సినిమాలను విడుదల చేయనున్నట్టు ప్రముఖ ఓటీటీ సంస్థ 'ఈటీవీ విన్' ఇప్పటికే ప్రకటించింది. వాటిలో ఒకటి 'బ్రేక్ అవుట్' . తాజాగా ఈ సినిమా స్ట్రీమింగ్ డేట్ ఖరారైంది. ఆ సినిమా ఈ నెల 9 నుంచి స్ట్రీమింగ్ కానుందని సంస్థ వెల్లడించింది. బ్రహ్మానందం తనయుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రలో సుబ్బు చెరుకూరి తెరకెక్కించిన చిత్రమిది. మోనోఫోబియా వ్యాధి ఉన్న వ్యక్తిగా హీరోగా కనిపిస్తాడు. రాజా లుక్, నటన కొత్తగా ఉంటాయి. ఒంటరిగా ఉండేందుకు భయపడే హీరో గ్యారేజ్లో చిక్కుకోవాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది? అక్కడ ఎలా బయటపడ్డాడు? మోనోఫోబియా నుంచి విముక్తి పొందాడా? తదితర అంశాలతో రూపొందిన ఈ సర్వైవల్ థ్రిల్లర్ గతంలో థియేటర్లలో విడుదలైంది.'పల్లకిలో పెళ్లికూతురు'తో సినిమాతో హీరోగా టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన రాజా గౌతమ్ ఆ తర్వాత 'బసంతి', 'మను' అనే విభిన్న కథా చిత్రాలతో మెప్పించారు. మరోవైపు, 'ఈటీవీ విన్' త్వరలో రిలీజ్ చేయనున్న చిత్రాలు 'వైఫ్ ఆఫ్' , 'పోతుగడ్డ' , 'మిస్మని' ఉన్నాయి. వీటి స్ట్రీమింగ్ డేట్స్ వెలువడాల్సి ఉంది.




## వేధింపులపై హనీరోజ్ ఫిర్యాదు .. 27 మందిపై కేసు

సోషల్మీడియా వేదికగా తాను వేధింపులు ఎదుర్కొంటున్నానని తెలిపారు నటి హనీరోజ్. ఈ విషయంపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా.. 27 మంది కేసు నమోదు అయింది.




## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1847: వాగ్గేయకారుడు త్యాగయ్య మరణం (జ.1767).
- 1852: అంధులకు బ్రెయిలీ లిపి రూపొందించిన లూయీ బ్రెయిలీ మరణం (జ.1809).
- 1867: స్వాతంత్ర సమరయోధుడు బయ్యా నరసింహేశ్వరశర్మ జననం (మ.1932).
- 1929: మదర్ తెరెసా భారత దేశంలోని కలకత్తా నగరం వచ్చి పేదలకు, రోగులకు సేవ చేసే కార్యక్రమం మొదలుపెట్టింది.
- 1932: సంగీత విద్వాంసుడు, రేడియో కళాకారుడు బలిజేపల్లి రామకృష్ణశాస్త్రి జననం.
- 1959: భారత క్రికెట్ క్రీడాకారుడు కపిల్ దేవ్ జననం.
- 1966: సంగీత దర్శకుడు, గాయకుడు ఎ.ఆర్.రెహమాన్ జననం. (చిత్రంలో)
- 1971: భారతీయ ఇంద్రజాలికుడు పి.సి.సర్కార్ మరణం (జ.1913).
- 2014: తెలుగు సినీ నటుడు ఉదయ్ కిరణ్ మరణం (జ.1980)ఖ



త్యాగయ్య



లూయీ బ్రెయిలీ




మదర్ తెరెసా



కపిల్ దేవ్



ఎ.ఆర్.రెహమాన్



పి.సి.సర్కార్



ఉదయ్ కిరణ్

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

## ప్రపంచ టెస్టు ఛాంపియన్షిప్ 2025-27 .. టీమ్ ఇండియా షెడ్యూల్ ఇదే

**ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ 2025-27 చక్రంలో టీమ్ ఇండియా మ్యాచ్ల వివరాలు బయటికి వచ్చాయి.**



వరుసగా మూడోసారి ప్రపంచ టెస్టు ఛాంపియన్షిప్ ఫైనల్ కు చేరాలకున్న టీమిండియాకు కంగారులు షాకిచ్చారు. బోర్డర్ గావస్కర్ ట్రోఫీ సిరీస్ను భారత్ 1- 3తో చేజార్చుకుంది. దీంతో టీమ్ ఇండియా 2023-25 డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించగా.. ఆస్ట్రేలియా తుది పోరుకు అర్హత సాధించింది. జూన్ 11 నుంచి ఇంగ్లాండ్ లోని లార్డ్స్ మైదానంలో దక్షిణాఫ్రికా, ఆసీస్ మధ్య ఫైనల్ జరగనుంది.ఇక, ఈ ఏడాది జూన్లోనే ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ 2025-27 ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో వచ్చే డబ్ల్యూటీసీలో టీమ్ ఇండియా మ్యాచ్ల షెడ్యూల్ వివరాలు బయటికి వచ్చాయి. ఇందులో భారత్ మొత్తం 18 టెస్టులు ఆడనుంది. స్వదేశంలో 9, విదేశీ గడ్డపై 9 టెస్టుల్లో తలపడనుంది. ఇంగ్లాండ్ 5, వెస్టిండీస్లో 2, సౌతాఫ్రికాతో 2, శ్రీలంకతో 2, న్యూజిలాండ్లో 2, ఆస్ట్రేలియాతో 5 టెస్టులు ఆడనుంది. ఈ ఏడాది జూన్లో ఇంగ్లాండ్ పర్యటనతో టీన్ఇండియా ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ మొదలవుతుంది. 2027 జనవరి-ఫిబ్రవరిలో స్వదేశంలో జరిగే బోర్డర్- గావస్కర్ ట్రోఫీ సిరీస్లో భారత జట్టు మ్యాచ్లు ముగుస్తాయి.

డబ్ల్యూటీసీ 2025-27.. టీమ్ ఇండియా షెడ్యూల్

టీన్ఇండియా ఇంగ్లాండ్ టూర్: 5 టెస్టులు, జూన్-ఆగస్టు 2025

వెస్టిండీస్ భారత పర్యటన: 2 టెస్టులు, అక్టోబర్ 2025

దక్షిణాఫ్రికా భారత పర్యటన: 2 టెస్టులు, నవంబర్-డిసెంబర్ 2025

టీన్ఇండియా శ్రీలంక టూర్: 2 టెస్టులు, ఆగస్టు 2026

టీన్ఇండియా న్యూజిలాండ్ టూర్ 2 టెస్టులు, అక్టోబర్-డిసెంబర్ 2026

ఆస్ట్రేలియా భారత పర్యటన: 5 టెస్టులు, జనవరి-ఫిబ్రవరి 2027

## ఫిట్నెస్

## ఎలాంటి మంగు మచ్చల్ని అయినా మాయం చేసే ఫేస్ప్యాక్స్, రెగ్యులర్గా అప్లై చేస్తే ఫేస్ మెరుస్తుంది

మచ్చలు లేని అందమైన, మృదువైన చర్మం కావాలని అందరికీ ఉంటుంది. కానీ, రోజంతా ఎండలో బయట తిరగడం, సరిలేని లైఫ్స్టైల్ ఇతర కారణాల వల్ల ముఖంపై పిగ్మంటేషన్ మొదలవుతుంది. దీనిని దూరం చేసేందుకు కొంతమంది క్రీమ్స్, లోషన్స్ వాడతారు. అయినా రిజల్ట్ అంతలా ఉండదు. అలా కాకుండా ఇంట్లోనే తయారుచేసే కొన్ని ఫేస్ప్యాక్స్తో ఈ పిగ్మంటేషన్ని దూరం చేసుకోవచ్చు. అదెలానో తెలుసుకోండి.

### ఎర్రకందిపప్పు



చర్మ సమస్యల్ని దూరం చేయడంలో ఎర్ర కందిపప్పు బాగా పనిచేస్తుంది. రెండు టేబుల్ స్పూన్ల ఎర్ర కందిపప్పులో అంతే పరిమాణంలో పాలు పోసి రాత్రంతా నానబెట్టండి. ఉదయాన్నే ఇందులో కొద్దిగా పసుపు వేసి మిక్సీ పట్టండి. తర్వాత దీనిని స్కిన్కి అప్ల చేయండి. ఆరిన తర్వాత స్క్రబ్ చేస్తూ క్లీన్ చేయండి. రెగ్యులర్గా చేస్తే మంగు మచ్చలు మాయం.

### బొప్పాయితోజి

బొప్పాయిలోనూ ఎక్స్ఫోలియేటింగ్ గుణాలు ఉన్నాయి.



దీంతోపాటు నేచురల్ బ్రైటెనింగ్ గుణాలు ఉన్నాయి. బొప్పాయి రసం ముఖానికి అప్లై చేస్తే నల్లని మచ్చలు, మంగు మచ్చలు దూరమవుతాయి. దీనిని మంగు మచ్చల్ని దూరం చేసేందుకు ఎలా వాడాలంటే 4, 5 బాగా పండిన బొప్పాయి ముక్కల్ని తీసుకోవాలి. ఇందులో కొద్ది బంగాళాదుంప రసం, దోసకాయ గుజ్జు వేయాలి, అందులోనే వాటర్ మెలన్ గుజ్జు కూడా వేయాలి. దీనిని ఫ్రిజ్లో పెట్టాలి. 15 నిమిషాల తీసి ముఖానికి అప్లై చేయాలి. తర్వాత రబ్ చేస్తూ క్లీన్ చేసుకోవాలి. ఇందులోని గుణాలు చర్మాన్ని మెరిపిస్తాయి.




### శనగపిండితో



శనగపిండి చర్మానికి చాలా మేలు చేస్తుంది. ఇది చర్మాన్ని మెరిపించేందుకు హెల్ప్ చేస్తుంది. దీనిలో పసుపు కలిసినప్పుడు ముఖంపై ఉన్న మచ్చలు తగ్గుతాయి. శనగపిండిలో కొద్దిగా పసుపు వేసి పేస్టులా చేసేందుకు పెరుగు వేసి కలపండి. ఇది మొత్తం పేస్టులా చేసి ముఖానికి అప్లై చేయండి. 15 నిమిషాల పాటు ఉండి తర్వాత రబ్ చేస్తూ క్లీన్ చేసుకోండి. రెగ్యులర్గా చేస్తే ముఖంపై ఉండే మంగు మచ్చలు తగ్గుతాయి.

### నిమ్మరసం, తేనె



నిమ్మరసంలో నేచురల్ బ్లీచింగ్ గుణాలు ఉన్నాయి. ఇవి మొండి ట్యాన్ మచ్చల్ని దూరం చేస్తాయి. దీనికోసం ఓ గిన్నెలో తాజా నిమ్మరసం తీసుకోండి. అందులోనే కొద్దిగా తేనె వేయండి. దీనిని బాగా కలపండి. దీనిని మీ ముఖంపైనున్న మచ్చలపై రాయండి. ఆరేంత వరకూ ఉండండి. తర్వాత నీటితో క్లీన్ చేయండి. రెగ్యులర్గా చేస్తే కచ్చితంగా ముఖంపై ఉండే మచ్చలు పోతాయి.

### కాఫీ పొడితో



కాఫీలో చర్మానికి మేలు చేసే ఎన్నో గుణ్నాల ఉన్నాయి. దీనిని వాడడం వల్ల యాన్నే దూ-రమవుతుంది. దీంతో ప్యాక్ వేసుకోవాలి. అదెలా అంటే.. కాఫీ పౌడర్లో కొద్దిగా కొబ్బరినూనె, కొంచెం పంచదార పొడి వేసి కలపాలి. దీనిని మొత్తం స్క్రబ్లా చేయాలి. ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల పాటు ఉండాలి. తర్వాత మెల్లిగా మసాజ్ చేస్తూ క్లీన్ చేయాలి. రెగ్యులర్గా చేస్తే మచ్చలు మాయం.

గమనిక:
నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.